
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 86 | బుధవారం 24 జూన్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-

# జొన్నగిరి.. ఇక సువర్ణగిరి

ఏడాదికి 400 కేజీల నుంచి 2 టన్నుల వరకూ బంగారం ఉత్పత్తి

గోల్డ్ మైనింగ్‌తో జొన్నగిరికి పూర్వ వైభవం

బంగారం శుద్ధి కర్మాగారంన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు



**(అంకుశం, తుగ్గలి, జూన్ 24):**

గోల్డ్ మైనింగ్‌తో జొన్నగిరిలో పూర్వ వైభవానికి శ్రీకారం చుట్టామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో బుధవారం బంగారం శుద్ధి కర్మాగారాన్న సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాయలసీమను రతనాల సీమగా మార్చడం జొన్నగిరి నుంచే ప్రారంభమవుతుంది. ఈ ప్రాంతాన్ని గతంలో సువర్ణగిరి అని పిలిచేవారు. అశోకుడి నాలుగో రాజధాని ఇది. జొన్నగిరిని సువర్ణగిరిగా మార్చుకుందామా? వందల ఏళ్ల క్రితమే ఈ ప్రాంతం బంగారం, రత్నాలతో నిండింది. అశోకుడి శాసనాలు ఈ ప్రాంత వైభవాన్ని చాటి చెబుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి సీమను కాపాడాలనే ఆలోచన చేసిన వ్యక్తి ఎన్టీఆర్. ఆయన నిర్ణయంతో రాయలసీమ ప్రాంతానికి ప్రాణం పోశాం. ఒకప్పుడు - మిగతా 2లో







# కొత్త సీఎస్‌గా సంజయ్!

- తదుపరి ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌జాజు ఖరారయ్యే అవకాశం
- ప్రస్తుతం కేంద్ర సర్వీసులో ఈశాన్య ప్రాంత అభివృద్ధి కార్యదర్శి
- సంజయ్ జాజును తిరిగి తెలంగాణ రాష్ట్రానికి పంపుతూకీలక నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వం
- కొత్త ప్రధాన కార్యదర్శి రేసులో జయేశ్ రంజన్‌తో పాటు సంజయ్‌జాజ పేర్లను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి..
- చివరకు జాజు వైపే మొగ్గు చూపినట్లు సమాచారం

వైసీపీ హయాంలో నిర్వీర్యమైన

# క్రీడా వ్యవస్థను పునరుద్ధరించాం



రెండేళ్లలో క్రీడలు, యువజన రంగాల్లో విప్లవాత్మక మార్పులు

గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడలకు ప్రోత్సాహం

**(అంకుశం, అమరావతి, జూన్ 24):**

వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన క్రీడా వ్యవస్థను పునరుద్ధరించామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలో - మిగతా 2లో

# సాయిబాబా భక్తుల మనోభావాలను గౌరవిస్తాం

నా వ్యాఖ్యలను వక్రీకరించి దుష్ప్రచారం చేయడం తగదు

దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి




**(అంకుశం, అమరావతి, జూన్ 24):**

సాయిబాబా ఆలయాల విషయంలో నేను చేసిన వ్యాఖ్యలను కొంతమంది వక్రీకరించి, సాయిబాబా భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేయడం బాధాకరం అని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. నా వ్యాఖ్యల ఉద్దేశాన్ని పూర్తిగా పక్కనబెట్టి కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నాను. నేను వ్యక్తిగతంగా సాయిబాబా భక్తుడిని. ప్రతిరోజూ ఉదయం నా పూజా మందిరంలో వివిధ దేవతామూర్తులతో పాటు గురుపీఠంపై కొలువై ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించిన తర్వాతే నా దినచర్యను ప్రారంభిస్తాను. సాయిబాబా పట్ల నాకు అత్యంత గౌరవం, భక్తి ఉన్నాయి. నా వ్యాఖ్యల వల్ల ఏ ఒక్క భక్తుని మనోభావాలు దెబ్బతిని ఉంటే, వారిని హృదయపూర్వకంగా మన్నించమని కోరుతున్నాను. రాష్ట్ర ప్రభుత్వం గానీ, దేవాదాయ శాఖ గానీ, తిరుమల తిరుపతి దేవస్థానాలు గానీ ఎవరిపైనా వివక్ష చూపడం లేదు. అలాగే ఎవరైనా ఆరాధించే మహనీయులను కించపరచే ఉద్దేశం కూడా మాకు లేదు. సాయిబాబా పట్ల కోట్లాది మంది భక్తులకు అపారమైన విశ్వాసం ఉంది. ఆ విశ్వాసాన్ని మేము పూర్తిగా గౌరవిస్తాము. సాయిబాబా ఆలయాల్లో పూజలు హిందూ సంప్రదాయాలకు అనుగుణంగా జరుగుతున్నాయన్న విషయం కూడా అందరికీ తెలిసిందే. అయితే టీటీడీ ఆధ్వర్యంలో చేపడుతున్న 5,000 భజన మందిరాలు నిర్మాణ కార్యక్రమానికి ఒక నిర్దిష్ట లక్ష్యం ఉంది. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, ప్రచారం , గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ హిందూ దేవాలయాల నిర్మాణమే ఆ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమానికి సంబంధించి నిధుల విడుదల టీటీడీ రూపొందించిన మార్గదర్శకాలు, శ్రీవాణి ట్రస్టు నిబంధనలు - మిగతా 2లో

# హజ్--2027 దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

## ఏపీ హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా



**(అంకుశం, అమరావతి, జూన్ 24):**

భారత ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని హజ్ కమిటీ ఆఫ్ ఇండియా విడుదల చేసిన హజ్--2027 నోటిఫికేషన్‌ను రాష్ట్రంలోని ముస్లిం సోదర సోదరీమణులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ సహకారంతో మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆయన తెలిపారు. హజ్ యాత్రికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర హజ్ కమిటీ కట్టుబడి ఉందన్నారు. హజ్--2027 దరఖాస్తులను 22 జూన్ 2026 నుండి 20 జూలై 2026 రాత్రి 11:59 గంటల వరకు ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు హజ్ సువిధ యాప్ లేదా హజ్ కమిటీ ఆఫ్ ఇండియా అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు 31--12--2027 వరకు చెల్లుబాటు అయ్యే భారతీయ పాస్‌పోర్ట్, తెలుపు నేపథ్యంతో పాస్‌పోర్ట్ సైజు ఫోటో, బ్యాంక్ పాస్‌బుక్ లేదా రద్దు చేసిన చెక్కు, చిరునామా ధవీకరణ పత్రం అప్లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. జూలై చివరి వారంలో నిర్వహించే ఖుర్రా (డిజిటల్ లాటరీ) అనంతరం ఎంపికైన యాత్రికులు రూ.1,52,300/-- అడ్వాన్స్ మొత్తాన్ని 10 ఆగస్టు 2026లోపు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

# 'విద్యార్థులను ఉగ్రవాదులంటారా?

నీట్ పేపర్ లీక్?కు సంబంధించి విద్యార్థులు చేపట్టిన నిరసనలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలు తీవ్రచర్చకు దారితీశాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై, విద్యాశాఖ మంత్రిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన ప్రభుత్వం ఇప్పుడు ప్రశ్నించే వారిని ఉగ్రవాదులుగా ముద్ర వేస్తోందని ఆరోపించారు.

ఎక్స్‌లో స్పందించిన ఖర్గే, కేంద్ర ప్రభుత్వ హయాంలో అనేక పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని పేర్కొన్నారు. "90 పేపర్ లీక్‌లు జరిగాయి. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింది. నీట్ పేపర్ లీక్ ఘటనతో 20 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఎన్నో కుటుంబాలు తీవ్ర వేదనను అనుభవిస్తున్నాయి. అయినా విద్యాశాఖ మంత్రి తన పదవిని అంటిపెట్టుకుని ఉండటమే కాకుండా, విద్యార్థుల గొంతును ఉగ్రవాదుల గొంతుగా అభివర్ణిస్తున్నారు" అని ఖర్గే విమర్శించారు.

**విద్యార్థుల విషయంలోనూ అదే ధోరణి: ఖర్గే**

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని దేశద్రోహులుగా చిత్రీకరించడం బీజేపీ నేతలకు అలవాటైందని కూడా ఆయన ఆరోపించారు. గతంలో రైతుల ఉద్యమాల సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైతులను ఆందోళన జీవులు, పరాన్న జీవులు అంటూ వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. ఇప్పుడు విద్యార్థుల విషయంలోనూ అదే ధోరణి కొనసాగుతోందని అన్నారు. "విద్యార్థుల స్వరం దేశవ్యాప్తంగా మరింత బలంగా వినిపిస్తుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే"



అంటూ ఖర్గే డిమాండ్ చేశారు. ఇదే అంశంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కూడా మండిపడ్డారు. జంతర్ మంతర్‌లో విద్యార్థులు నిర్వహిస్తున్న నిరసనల సందర్భంగా విద్యాశాఖ మంత్రి వారిని ఉగ్రవాదుల బీ–టీమ్‌గా అభివర్ణించారని ఆరోపించారు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్‌ను కూడా ఆయన సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. "విద్యార్థుల ఆత్మహత్యలకు న్యాయం చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాం. అలాంటి మమ్మల్ని ఉగ్రవాదుల బీ–టీమ్ అంటున్నారు. దేశ యువతను ఉగ్రవాదులుగా పిలిచే హక్కు ఎవరికీ లేదు. మేము ఉగ్రవాదులు కాదు. దేశభక్తి సర్టిఫికెట్లు మీలాంటి వారి నుంచి మాకు అవసరం లేదు" అని దీప్కే తీవ్రంగా స్పందించారు. మరో పోస్టులో ఆయన మరింత ఘాటుగా స్పందించారు. "మమ్మల్ని ఉగ్రవాదులంటున్నారు. కానీ విద్యార్థుల మరణాలకు బాధ్యత వహించాల్సింది ఎవరో దేశ ప్రజలకు తెలుసు" అని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, ధర్మేంద్ర ప్రధాన్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో జంతర్‌మంతర్ వద్ద తన రాజీనామా కోరుతూ జరుగుతున్న నిరసనలపై స్పందించారు. ప్రజాస్వామ్యంలో తిరస్కరణకు గురైన కొన్ని శక్తులు మారువేషంలో వచ్చి వ్యవస్థను లక్ష్యంగా చేసుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. దేశాన్ని విభజించాలనుకునే వారి కోసం నినాదాలు చేస్తున్నవారే ఈ నిరసనల వెనుక ఉన్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలే ప్రస్తుతం వివాదానికి కేంద్రబిందువయ్యాయి.

**ఎంతటి అహంకారానికి నిదర్శనం?: కేజ్రీవాల్**

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ అంశంపై కేంద్ర మంత్రిని విమర్శించారు. "పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న అమాయక విద్యార్థులు దేశాన్ని విభజించాలనుకుంటున్నారా? వారి భవిష్యత్తును నాశనం చేస్తూ దేశాన్ని కాపాడుతున్నామని చెప్పడం ఎంతటి అహంకారానికి నిదర్శనం?" అంటూ ఎక్స్‌లో ప్రశ్నించారు. కాగా, నీట్–యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ వివాదం మధ్యే జూన్ 21న నిర్వహించిన రీ–ఎగ్జామినేషన్ దేశవ్యాప్తంగా, అలాగే విదేశాల్లోని 14 కేంద్రాల్లో పూర్తైంది. అయితే పరీక్షల నిర్వహణ, పారదర్శకత, విద్యార్థుల భవిష్యత్తుపై ఇంకా అనేక ప్రశ్నలు మిగిలే ఉన్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. నీట్ పేపర్ లీక్ అంశం ఇప్పుడు కేవలం పరీక్షల పరిమితిని దాటి రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది.

# మోదీ కేబినెట్‌లో భారీ మార్పులు?

**న్యూఢిల్లీ:** కేంద్ర మంత్రివర్గంలో త్వరలోనే భారీ పునర్వ్యవస్థీకరణ జరగనున్నట్లు జాతీయ రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్‌లో మార్పులు, చేర్పులపై బీజేపీ అధిష్ఠానం అంతర్గతంగా విస్తృత కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్ రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో మరికొందరు మంత్రులను కూడా రాజీనామా చేయాలని పార్టీ నాయకత్వం కోరే అవకాశముందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సమాచారం మేరకు.. కేంద్ర మంత్రివర్గంలో దాదాపు 38 మంది మంత్రుల బాధ్యతల్లో మార్పులు ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. పనితీరు ఆశించిన స్థాయిలో లేని మంత్రులకు ఉద్వాసన పలుకుతూ, ఎన్నికల దృష్ట్యా కీలక రాష్ట్రాలకు చెందిన ఎంపీలకు మంత్రి పదవులు కట్టబెట్టే వ్యూహాన్ని బీజేపీ అమలు చేయవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఏడాది చివర్లో పంజాబ్, యూపీ, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, మణిపూర్, గోవా రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయా రాష్ట్రాలకు ప్రాతినిధ్యం పెంచే దిశగా నిర్ణయాలు ఉండొచ్చని తెలుస్తోంది. అలాగే మోదీ కేబినెట్‌లో చాలా కాలంగా కొనసాగుతున్న కొందరు సీనియర్ మంత్రులను తప్పించి, యువతకు, ముఖ్యంగా జెన్–జీ తరం నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఆలోచనలో పార్టీ అధిష్ఠానం ఉన్నట్లు సమాచారం. యువ ఓటర్లను ఆకర్షించే లక్ష్యంతో కొత్త తరానికి చెందిన నాయకులను మంత్రివర్గంలోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. మంత్రి పదవుల రేసులో పలు పేర్లు వినిపిస్తున్నాయి. శ్రీకాంత్ షిండే, ఈటల రాజేందర్, డీకే



అరుణ, కకోలీ ఘోష్, తదితర నేతలకు అవకాశాలు ఇవ్వనున్నట్టు ప్రచారం జరుగుతోంది. తెలంగాణ నుంచి కూడా పలు కీలక మార్పులు ఉండొచ్చని సమాచారం. ఇక ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన ఎంపీలకు(రాఘవ్ చద్దా, టీఎంసీ నుంచి పలువురు, మహారాష్ట్ర నుంచి కొందరు) కూడా మంత్రివర్గంలో స్థానం కల్పించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల నుంచి వచ్చిన నేతలకు ప్రాధాన్యత ఇచ్చే దిశగా చర్చలు జరుగుతున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

గతంలో మోదీ 2.0 ప్రభుత్వ హయాంలో జరిగిన మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో 12 మంది మంత్రులు రాజీనామా చేయగా, పలువురికి పదోన్నతులు లభించాయి. దాదాపు 30 మంది కొత్త వారికి మంత్రివర్గంలో చోటు దక్కింది. అదే తరహాలో ఈసారి కూడా భారీ మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, కేంద్ర ప్రభుత్వం లేదా బీజేపీ అధిష్ఠానం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ప్రస్తుతం జరుగుతున్న ప్రచారాలపై ఆసక్తి నెలకొంది. రాజకీయంగా కీలకమైన రాష్ట్ర ఎన్నికల ముందు జరిగే ఈ పునర్వ్యవస్థీకరణ దేశ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీయనుంది.

# భారీగా తగ్గనున్న పెట్రోల్, డీజిల్ ధరలు

**ముంబై :** ఇరాన్–ఇజ్రాయెల్–అమెరికా యుద్ధం యావత్ ప్రపంచాన్ని ఇబ్బందుల్లోకి నెట్టేసింది. చమురు సరఫరాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మూతపడడంతో ప్రపంచ మార్కెట్లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల పైకి చేరి, ఇంధన, వాణిజ్య సంక్షోభం తలెత్తేలా కనిపించింది. కానీ తాజాగా అమెరికా– ఇరాన్ మధ్య జరిగిన శాంతి ఒప్పందంతో చమురు ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెండ్ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు వి77.39 డాలర్లు వద్ద ట్రేడ్ అవుతుంటే.. డబ్ల్యూటీఐ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు వి73.57 వద్ద ట్రేడ్ అవుతోంది.అయితే ప్రస్తుతం హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడంతో, ప్రపంచవ్యాప్తంగా చమురు నిల్వలు అవసరానికి మించి పెరిగిపోతాయని మార్కెట్లు అంచనా వేస్తున్నాయి. రాబోయే రెండేళ్లలో ప్రపంచ చమురు సరఫరా, డిమాండ్ కంటే చాలా వేగంగా పెరుగుతుందని, తద్వారా 2027 నాటికి చమురు మిగులు ఏర్పడుతుందని అంతర్జాతీయ ఇంధన సంస్థ పేర్కొంది. పశ్చిమ ఆసియాలో జరిగిన యుద్ధం కారణంగా రోజుకు 14 మిలియన్ బ్యారెళ్ల (ఎజూట) చమురు ఉత్పత్తి నిలిచిపోయిందని ఎఇం అంచనా వేసింది.క్రిస్టల్ ఎనర్జీ గ్లోబల్ అడ్వైజర్ క్రిస్టాఫ్ రూహ్లా అభిప్రాయం ప్రకారం.. 2027 నాటికి ప్రపంచ సరఫరా, డిమాండ్ కంటే రోజుకు 1 మిలియన్ బ్యారెళ్ల కంటే ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 60 డాలర్ల కంటే కిందకు పడిపోయే అవకాశం ఉంది. దీని ప్రభావంతో భారత్‌లో ఇంధన ధరలు తగ్గే అవకాశం ఉందని గేట్‌వే హౌస్‌లో ఎనర్జీ, ఇన్వెస్ట్‌మెంట్ అండ్ కనెక్టివిటీ సీనియర్ ఫెలో అమిత్ భండారీ తెలిపారు. అయితే ఈ తగ్గదల అనేది తక్షణమే ఉండకోవచ్చని.. దానికి దాదాపు 5–6 నెలల సమయం పడుతుందన్నారు.అంతేకాదు రాబోయే రోజుల్లో ప్రపంచ ఇంధన మార్కెట్లలో భారీ మార్పులు రాబోతున్నాయని నిపుణులు అంటున్నారు. 2027 నాటికి ప్రపంచ చమురు సరఫరా రోజుకు సుమారు 8 మిలియన్




బ్యారెళ్లు పెరుగుతుందని, కానీ డిమాండ్ కేవలం 2 మిలియన్ బ్యారెళ్లు మాత్రమే ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీని వల్ల ప్రపంచ మార్కెట్‌లో భారీ ఎత్తున చమురు మిగులు ఏర్పడుతుందని భావిస్తున్నారు. ఇది ప్రపంచ దేశాలకు ఎంతగానో ఉపశమనాన్ని కలిగిస్తోందని.. ఇది ధరలను తగ్గించడమే కాకుండా.. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఏర్పడి కొరతను ఫుల్‌ఫిల్ చేసుకోవడానికి సహాయపడుతుందన్నారు. అమెరికా–ఇరాన్ ఒప్పందం ఇలాగే కొనసాగితే గల్ఫ్ దేశాల నుండి చమురు ఎగుమతులు క్రమంగా పుంజుకుంటాయని ఎఇం భావిస్తోంది. శాశ్వత ఒప్పందం కుదిరి, ఇరాన్ ఎగుమతులపై ఆంక్షలు తొలగిపోతే, మరింత ముడి చమురు అంతర్జాతీయ మార్కెట్లలోకి వస్తుంది. ఇది సరఫరాను మరింత మెరుగుపరిచి, చమురు ధరలపై ఉన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావాన్ని తగ్గిస్తుందని పేర్కొంది

## జొన్నగిరి.. ఇక సువర్ణగిరి

-మొదటిపేజీ తరువాయి

కేజీఎఫ్ గురించి దేశవ్యాప్తంగా చర్చ జరిగేది. ఇప్పుడు దేశవ్యాప్తంగా జొన్నగిరి గురించి చర్చ జరుగుతుంది. చమురు తర్వాత దిగుమతికి అధికంగా విదేశీ మారక ద్రవ్యం వాడేది బంగారానికే. ఇక్కడ ఏడాదికి టన్ను బంగారం ఉత్పత్తి అవుతుంది. ఇప్పటికి 400 కిలోల సామర్థ్యంతో ప్రారంభమైంది. భవిష్యత్తులో వెయ్యి కిలోలకు చేరుతుంది. ఇప్పటికే 800 ఉద్యోగాలు వచ్చాయి. త్వరలో 1500 మందికి ఉపాధి కల్పిస్తాం. భవిష్యత్తులో 5వేల మందికి ఈ గోల్డ్ మైన్స్‌లో ఉపాధి దొరుకుతుంది. జొన్నగిరి రాష్ట్రానికి ఆదర్శంగా తయారవుతుంది. ఈ ప్రాంతానికి గ్రోత్ ఇంజిన్‌గా మారుతుంది. ఇక్కడ నగల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నా. ఏడాదికి 400 కేజీలతో ప్రారంభించి తదుపరి దశలో 900 కేజీలు, అనంతరం 2 టన్నుల వరకూ ఉత్పత్తి చేసేలా జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్ ప్రాజెక్టు ఏర్పాటు. ఈ ప్రాజెక్ట్ చేపట్టిన జియో మైసూర్ సర్వీసెస్, త్రివేణి ఎర్త్ మూవర్స్ సంస్థల యాజమాన్యానికి, ఉద్యోగులకు, కార్మికులకు అభినందనలు. జొన్నగిరి ఘనత నేటిది కాదు. ఈ ప్రాంతానికి ఎంతో చరిత్ర ఉంది. ఈ ప్రాంతాన్ని సువర్ణగిరి అని పిలిచేవారు. అశోకుడి నాలుగు రాజధానుల్లో సువర్ణగిరి, ఈనాటి జొన్నగిరి. వందల సంవత్సరాల క్రితమే ఈ ప్రాంతం బంగారం, రత్నాలతో నిండింది. ఇక్కడకు దగ్గరలో లభించిన అశోకుడి ఎర్రగుడి శాసనాలు ఈ ప్రాంత వైభవాన్ని చెబుతున్నాయి. బంగారం ఎక్కడికో తరలించి ఆభరణాలు తయారు చేసే బదులు ఇక్కడే ఓ జ్యుయలరీ పార్కు కూడా ఏర్పాటు చేస్తాం అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు మైనింగ్ నుంచి తుది ఉత్పత్తి వరకూ జరిగే ప్రక్రియలను జియో మైసూర్ సంస్థ చైర్మన్ ప్రభాకరన్, ఎండీ నవీన్ లాల్ చంద్ర వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా భక్తుల మనోభావాలను గౌరవిస్తాం

-మొదటిపేజీ తరువాయి

మరియు పరిపాలనా విధానాల ప్రకారమే జరుగుతోంది. ఇది ఎవరి విశ్వాసాన్ని తక్కువ చేసి చూడడం కాదు. నిధుల కేటాయింపు అనేది పూర్తిగా ట్రస్టు లక్ష్యాలు, నిబంధనలు, పరిపాలనా మార్గదర్శకాల ఆధారంగా జరుగుతున్న ప్రక్రియ మాత్రమే. సాయిబాబా ఆలయాలకు ఈ పథకం కింద నిధులు ఇవ్వకపోవడం అంటే సాయిబాబా స్వామివారిని లేదా ఆయన భక్తులను అవమానించడం కాదని మరోసారి స్పష్టం చేస్తున్నాను. మన సమాజంలో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, పరమశివుడు, అమ్మవారు, అయ్యప్ప స్వామి, ఆంజనేయస్వామి, సాయిబాబా వంటి అనేక ఆరాధనా రూపాల పట్ల ప్రజలకు అపారమైన విశ్వాసం ఉంది. ప్రభుత్వం ఏ విశ్వాసాన్నీ కించపరచదు. ప్రతి భక్తుని మనోభావాలను గౌరవించడం మా ప్రభుత్వ విధానం. కాబట్టి ఈ అంశాన్ని అనవసర వివాదంగా మార్చడం సరికాదు. ఇది భక్తి, విశ్వాసాలకు సంబంధించిన అంశం కాదు. ట్రస్టుల లక్ష్యాలు, వాటి నిబంధనలు మరియు పరిపాలనా విధానాలకు సంబంధించిన అంశం మాత్రమే. సనాతన ధర్మ పరిరక్షణతో పాటు ప్రతి భక్తుని విశ్వాసాన్ని గౌరవించడం మా ప్రభుత్వం మరియు దేవాదాయ శాఖ యొక్క స్పష్టమైన విధానం. సాయిబాబా భక్తుల విశ్వాసాన్ని మేము గౌరవిస్తాం. అదే సమయంలో సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ట్రస్టుల లక్ష్యాలను కూడా గౌరవిస్తాం. వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ఎవరూ నమ్మవద్దని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కోరారు.

## వైసీపీ హయాంలో నిర్వీర్యమైన క్రీడా వ్యవస్థను పునరుద్ధరించాం

-మొదటిపేజీ తరువాయి

బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గత రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో క్రీడాలు యువజన సేవల అభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇచ్చాం. విజయనగరం విజ్జీ స్టేడియం, తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో మల్టీ పర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను పూర్తిచేసి ప్రారంభించామని తెలిపారు. ఖేలో ఇండియా పథకం కింద రూ.75 కోట్లతో విజయవాడ, కుప్పం, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, గుంటూరులో ఆధునిక క్రీడా మౌలిక వసతుల నిర్మాణ పనులు కొనసాగుతున్నా యని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు రూ.5.60 కోట్ల నగదు ప్రోత్సాహకాలు అందించగా, వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 429 మంది క్రీడాకారులకు రూ.19 కోట్ల ప్రోత్సాహకాలు అందించినట్లు చెప్పారు. క్రీడాకారుల ఉద్యోగ రిజర్వేషన్లను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచడంతో రెండు సంవత్సరాల్లో 819 మంది క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో క్రీడా వికాస కేంద్రాల నిర్మాణం చేపట్టామని, ఇప్పటివరకు 46 కేంద్రాలు పూర్తయ్యాయని, మరో 91 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. అమరావతి ఛాంపియన్‌షిప్‌లు, పారా బ్యాడ్మింటన్, బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ వంటి పలు జాతీయ స్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 31 క్రీడా విభాగాల్లో లీగ్ పోటీలను నిర్వహిస్తున్నామని, విశాఖపట్నం, కాకినాడ, తిరుపతిలో మూతపడిన క్రీడా అకాడమీలను తిరిగి ప్రారంభించి 13 క్రీడా విభాగాల్లో శిక్షణ అందిస్తున్నామని వెల్లడించారు. యువజన సేవల విభాగం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా యువజన ఉత్సవాలు, వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్, వ్యక్తిత్వ వికాసం మరియు కెరీర్ కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించి లక్షలాది మంది యువతకు ప్రయోజనం చేకూర్చినట్లు మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో యువజన సంక్షేమం,క్రీడలు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, శాప్ ఎండీ భరణి పాల్గొన్నారు. అనంతరం 2026 ఆంధ్రా యువసంకల్ప్ కరపత్రాన్ని విడుదల చేశారు.

## ఎస్ఐఆర్‌లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా..?

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నుంచి పేరు తొలగించబడిన వారికి రేషన్ నిరాకరిస్తూ పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఎస్ఐఆర్‌లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా అంటూ సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తంచేసింది. ఇది రాష్ట్ర పరిధిలోని ప్రత్యేక కారణాలతో కూడిన అంశం కాబట్టి.. ఆర్టికల్ 32 కింద నేరుగా సుప్రీంకోర్టుకు రాకుండా ముందుగా కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దాంతో పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్ ప్రసన్న తన పిటిషన్‌ను ఉపసంహరించుకుని హైకోర్టుకు వెళ్లేందుకు అనుమతి కోరారు. రేషన్ నిరాకరణ వివాదంపై కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన వెకేషన్ బెంచ్ ఆదేశాలు జారీచేసింది.

## పాకిస్థాన్ గగనక్షేత్రంలోకి ప్రవేశించిన ఎయిర్ ఇండియా విమానం

**న్యూఢిల్లీ:** ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ–321 ఢిల్లీ– అమృత్‌సర్ విమానం.. పాకిస్థాన్ వైమానిక క్షేత్రంలోకి ప్రవేశించింది. దీంతో కొంత ఉద్రిక్త క్షణాలు నెలకొన్నాయి. అయితే పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన తర్వాత రెండు దేశాల మధ్య సరైన సంబంధాలు లేని విషయం తెలిసిందే. సోమవారం రాత్రి ఎయిర్ ఇండియాకు చెందిన విమానం కొన్ని సెకన్ల పాటు పాక్ గగనతలంలోకి ప్రవేశించినట్లు తెలిసింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపడుతున్నట్లు ఎయిర్ ఇండియా చెప్పింది. పాక్ వైమానిక క్షేత్రంలోకి ప్రవేశించిన విషయాన్ని పైలట్ గుర్తించాడని, పాకిస్థాన్ ఎయిర్ ట్రాఫిక్ అథారిటీ నుంచి పైలట్‌కు వార్నింగ్ మెసేజ్‌లు వచ్చినట్లు తెలిసింది. సోమవారం రాత్రి 9.18 నిమిషాలకు ఢిల్లీ నుంచి ఆ విమానం టేకాఫ్ తీసుకున్నది. అయితే అమృత్‌సర్‌లో 10.30 నిమిషాలకు ఆ విమానం ల్యాండ్ కావాలి. కానీ అనుకోకుండా ఆ విమానం పాక్ ఎయిర్‌స్పేస్‌లోకి ఎంటరైంది. ఆ సమయంలో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు శ్రీ గురు రామ్ దాస్ జీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు మేనేజింగ్ అధికారి తెలిపారు. స్థానిక ఎయిర్ పోర్టు కంట్రోల్ రూమ్ ఆదేశాలతో ఆ విమానం ఢిల్లీకి తిరిగి వచ్చేసింది. మళ్లీ రెండు గంటల వ్యవధి తర్వాత టేకాఫ్ తీసుకుని ఆ రోజు రాత్రి 2.20 నిమిషాలకు అమృత్‌సర్ చేరుకున్నది. పాకిస్థాన్ ఎయిర్‌స్పేస్‌లో కనీసం రెండు కిలోమీటర్ల దూరం కూడా ఆ విమానం వెళ్లలేదని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ భూపేందర్ సింగ్ తెలిపారు.

## కొత్తచెరువు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నూతన డీఈఓ కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే, మాజీమంత్రి

**అంకుశం న్యూస్, కొత్తచెరువు ,జూన్:24:** శ్రీ సత్యసాయి జిల్లా,కొత్తచెరువు మండల కేంద్రంలోని బాయ్స్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్,పుట్టపర్తి శాసనసభ్యురాలు పల్లె సింధూరరెడ్డి,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సంయుక్తంగా లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా నూతన కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి,జ్యోతి ప్రజ్వలన గావించి కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, పరిపాలనను ప్రజలకు, ఉపాధ్యాయులకు మరింత చేరువ చేసేందుకు ఈ నూతన డీఈఓ కార్యాలయం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈ కార్యాలయం అందుబాటులోకి రావడం వల్ల విద్యాశాఖకు సంబంధించిన పనులు మరింత వేగంగా సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి పల్లె





రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ .. నియోజకవర్గ కేంద్రంలో విద్యాశాఖకు సంబంధించి కీలకమైన డీఈఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమని ,విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవసరమైన సేవలు ఇక్కడి నుండి వేగంగా అందుతాయని తెలిపారు.విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందన్నారు.కార్యాలయ ప్రారంభోత్సవం అనంతరం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి నూతన డీఈఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి,వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. కార్యాలయ ఆవరణ పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి క్రిస్టప్ప, తహసీల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, కళాశాల అధ్యాపకులు,రెవెన్యూ సిబ్బంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిసిఎల్ఏ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్,జేసీ మౌర్య భరద్వాజ్

**అంకుశం న్యూస్,శ్రీ సత్యసాయి,పుట్టపర్తి, జూన్:24:** సత్యసాయి జిల్లా కలెక్టర్,జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.జిల్లాలో భూ రికార్డుల నిర్వహణను మరింత పారదర్శకంగా మార్చాలని ,పెండింగ్ లో ఉన్న మ్యుటేషన్లు (భూ బదిలీలు)ఇతర రెవెన్యూ దరఖాస్తులను నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.జిల్లాలో జరుగుతున్న భూ సర్వే పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ,నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సర్వే పరంగా ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని స్పష్టం చేశారు.రెవెన్యూ,సర్వే సిబ్బంది క్షేత్రస్థాయిలో పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు జాప్యం లేని సేవలు అందించాలని సూచించారు.ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నిర్దేశించిన గ్రామాల్లో భూ రీసర్వే ప్రక్రియను పక్కాగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.క్షేత్రస్థాయిలో ఎలాంటి తప్పులు



దొర్లకుండా అత్యాధునిక సాంకేతికతతో సర్వే నిర్వహించాలన్నారు. రీసర్వే పూర్తయిన వెంటనే అర్హులైన భూ యజమానులందరికీ 100% పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించి, పంపిణీ చేయాలని స్పష్టం చేశారు.ఎక్కడా ఎలాంటి పెండింగ్స్ ఉండకూడదని తేల్చి చెప్పారు.రీసర్వే,పాస్ పుస్తకాలకు సంబంధించి రైతుల నుండి వచ్చే సరిహద్దు వివాదాలు,మ్యుటేషన్లు, ఇతర ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి వారికి ఇబ్బంది లేకుండా చేయాలన్నారు. ఆర్డీవోలు,తహశీల్దార్లు,సర్వే సిబ్బంది రోజువారీ ప్రగతిని పర్యవేక్షిస్తూ లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.వర్షపు నీటిని నిధులుగా మలచుకుని,భూగర్భ జలాలు పెంపొందించేందుకు



చెరువులు,కుంటల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.జిల్లాలో తాగునీరు, సాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా చెరువుల్లోకి నీరు చేరే ప్రవాహ మార్గాలను (నల్లాలు, వాగులు) పునరుద్ధరించాలని స్పష్టం చేశారు.నీటి పొదుపు,జల సంరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరూ భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌డిసి విజయ కుమారి,జిల్లా సర్వే అధికారి విజయ శాంతి,ఎఓ సక్సేన, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సోలార్ వద్దు రైతే ముద్దు

**– సంవత్సరానికి మూడు పంటలు తీసే భూముల్లో,రైతుల ప్రమేయం లేకుండా అక్రమంగా సోలార్ ప్రాజెక్టు ను నిర్మిస్తే అడ్డుకుంటాం,బిఎస్. మక్బుల్ అహ్మద్**



**అంకుశం న్యూస్,శ్రీ సత్యసాయి జిల్లా, కదిరి నియోజకవర్గం, జూన్:24:** కదిరి నియోజకవర్గం లోని ఎన్ పి కుంట మండలంలో రైతుల ప్రమేయం లేకుండా అక్రమంగా సోలార్ ప్రాజెక్ట్ నిర్మించేందుకు భూమి పూజ చేసి సర్వే చేసి ఉండడంతో రైతులు చేస్తున్న నిరసనకు మద్దతుగా కదిరి నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త బి.ఎస్ మక్బూల్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంబూల పూలకుంటలో మండలంలో మరకం దిన్నె,వెలిచెలమల, ధనియానిచెరువు,గౌకనపల్లి రైతులు దాదాపు 500 కుటుంబాలు 100 సంవత్సరాలనుండి భూములలో సాగు చేసుకుంటున్న వాటిని లాక్కొని లోపాయకారి ఒప్పొందాలతో ప్రైవేటు కంపెనీలకి ధారధాత్తం చెయ్యాలి అని చూస్తున్నారని రైతులకు అండగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.చంద్రబాబు నాయుడు ఎప్పుడు వ్యవసాయం దండగ అని చెప్తుంటారు. కూటమి నాయకులు కుడా అదే బాటలో నడుస్తూ రైతులని నట్టేట ముంచుతున్నారు ..వైస్సార్సీపీ పార్టీ ఎల్లప్పుడు రైతులకి తోడుగా రైతుల పక్షాన ఉంటుంది అని తెలియజేశారు. కదిరి ఎమ్మెల్యే మాజీ ముఖ్యమంత్రి వర్యులు జగన్మోహన్ రెడ్డి ని పదే పదే వ్యక్తిగత దూషణలు చేస్తున్నారు.జగన్ మోహన్ రెడ్డి గురించి మాట్లాడే స్థాయి స్థానిక ఎమ్మెల్యే కి లేదని రాబోవు రోజుల్లో అయ్యిన రాజకీయం హుందా చెయ్యాలి అని కోరుకుంటున్నానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు,స్థానిక రైతులు,సిపిఐ,సీపీ ఎం,లెఫ్ట్ పార్టీనాయకులు, ప్రజలు పాల్గొన్నారు .

## విష్ణులాయంలో గాలిగోపురం కలశస్థాపన, కళ్యాణ మండపం ప్రారంభిశీచిన ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు.



**అంకుశం న్యూస్ తూర్పుగోదావరి జిల్లా జూన్ 24:** అనపర్తి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామి (విష్ణులాయం) ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానశీ ,శ్రీవాణి ట్రస్ట్ నిధులతో నిర్మించిన గాలిగోపురం కలశస్థాపన మరియు కళ్యాణ మండపంను ప్రారంభిశీచిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామి (విష్ణులాయం) ఆలయ కమిటీ ఛైర్మన్,కమిటీ సభ్యులు,అనపర్తి మండలం,టౌన్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అనంతలోజూలై 1న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన

**– బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించిన జిల్లా ఎస్పీ పి.జగదీష్**



**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం జూన్ 24** :అనంతపురం జిల్లా అనంతపురం నగరంలో– భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారు జులై 1 వ తేదీన ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (జఖాూా) లోని



జ్ఞాన సీమ' ప్రాంగణంలో నిర్వహించనున్న విశ్వవిద్యాలయ తొలి స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.ఈనేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యలులో భాగంగా స్నాతకోత్సవ కార్యక్రమ వేదిక, హెలిప్యాడ్ లు, పార్కింగ్ స్థలాలు, రూటు బందోబస్తు , తదితర బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ పి జగదీష్ ఇతర అధికారులు సమీక్షించారు. – జిల్లా ఎస్పీ జగదీష్ తో పాటు ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, అనంతపురం రూరల్ డీఎస్పీ టి.శ్రీనివాసులు, సెంట్రల్ యూనివర్శిటీ సెక్యూరిటీ లైజన్ ఆఫీసర్ రిటైర్డ్ డీఎస్పీ రామకృష్ణయ్య, సి.ఐ లు ధరణీకిశోర్ , క్రాంతికుమార్ , సుబ్బరాయుడు, వెంకటేష్ నాయక్ ... ఆర్ ఐ పవన్ కుమార్ లు ఉన్నారు

## తుంగభద్రకు కొత్తగేట్లు... చారిత్రాత్మక ఘట్టం

**– అనంతపురం జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలి..**

**– తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు**



**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 24:** ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు జీవనాడిగా నిలిచిన తుంగభద్ర కొత్త నూతన గేట్లతో సరికొత్త రూపును సంతరించుకోవడం ఆనందదాయకమని అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. 2024 ఆగస్టులో సంభవించిన భారీ వరదల కారణంగా ప్రాజెక్టులోని 19వ గేటు దెబ్బతినడంతో, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (చీఙూా) సూచనల మేరకు రూ.51 కోట్ల వ్యయంతో అత్యంత వేగంగా 33 కొత్త గేట్ల అమరిక పూర్తి కావడం అభినందనీయమని అన్నారు. కేవలం ఆరు నెలల వ్యవధిలో ఈ భారీ పనులు పూర్తి కావడం ప్రభుత్వాల సమన్వయానికి నిదర్శనమని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో 1.46 లక్షల హెక్టార్లకు సాగునీరు అందడంతో పాటు వందలాది గ్రామాలకు తాగునీటి అవసరాలు తీర్చబడుతున్నాయని గుర్తు చేశారు. అందువల్ల తుంగభద్ర ప్రాజెక్టు భద్రతను ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయని చెప్పారు. ఈ నెల 25వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ గారు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్ గారు సంయుక్తంగా ఈ కొత్త గేట్లను ప్రారంభించనున్నారని తెలిపారు. అనంతరం హోస్పేటలో నిర్వహించే బహిరంగ సభలో వారు పాల్గొంటారని చెప్పారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి రాయదుర్గం, కళ్యాణదుర్గం, గుంతకల్ నియోజకవర్గాల ప్రజలతోపాటు జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పూల నాగరాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం తుంగభద్ర ప్రాజెక్టు భద్రతకు, రైతాంగ భవిష్యత్తుకు ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

## వాతావరణ మార్పులను జయించే 'పెల్లెటైజ్డ్ పీఎండీఎస్'.. రాప్తాడులో క్షేత్రస్థాయిని పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్ సూయాజ్ కుమార్!

**రాప్తాడు అంకుశం న్యూస్ జూన్ 25 :** ప్రస్తుత వాతావరణ మార్పులు, ఎల్-నినో వంటి సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ, రైతులు తక్కువ ఖర్చుతోనే ఆశించిన స్థాయిలో అధిక దిగుబడులు సాధించేందుకు 'పెల్లెటైజ్డ్ పీఎండీఎస్' బెస్ట్ (ప్రీ మేనేజ్మెంట్ బేస్డ్ డైవర్సిఫైడ్ సిస్టం) – తెగుళ్లు లేని, యాజమాన్య ఆధారిత, వైవిధ్యభరితమైన సాగు పద్ధతి) విధానం ఒక వరప్రసాదమని అనంతపురం అసిస్టెంట్ కలెక్టర్ సూయాజ్ కుమార్ అన్నారు. రాప్తాడు మండలంలో ఆయన పర్యటించి, స్థానిక రైతులు శంకరయ్య, గోపాల్ రెడ్డికి చెందిన పంట పొలాల్లో చేపట్టిన పీఎండీఎస్ క్షేత్రాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి పొలంలో నిర్వహించిన 'పెల్లెటైజ్డ్ సోయింగ్ డెమో'ను ఆయన ఆసక్తిగా తిలకించారు. ఈ పద్ధతి ద్వారా ఆముదం, కందులు, అనుములు, సజ్జలు, అలసందలు మరియు గోరుచిక్కుడు వంటి ప్రధాన పంటలతో పాటు 25 రకాల బయోడైవర్సిటీ విత్తనాలను, బంకమట్టి, బూడిద మరియు ఘన జీవామృతంతో కలిపి విత్తన గుళికలుగా తయారు చేయడం వల్ల నేల సారం గణనీయంగా



పెరుగుతుందని ఆయన వివరించారు. ఈ కొత్త సాగు విధానాన్ని అవలంబించడం వల్ల పంటలకు చీడపీడల బెడద తగ్గి, భూమిలోని పోషక విలువలు రెట్టింపు అవుతాయని అసిస్టెంట్ కలెక్టర్ రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవిసి విజయ్ కుమార్, ఐ.ఓ.డి. పి.యం. లక్ష్మానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి సాలు రెడ్డి, ఏడీఏ వెంకటకుమార్, రాప్తాడు ఏవో కృష్ణ చైతన్య, వి.ఎ.ఏ భారతి, ఎస్‌పిఎం డాక్టర్ నవీన్, డాక్టర్ నరేంద్ర, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది మరియు అధిక సంఖ్యలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

## పోలీసుల హామీతో దీక్ష విరమించిన సత్యనారాయణ

**.వైఎస్ఆర్ కడప జిల్లా, పోరుమామిళ్ల, జూన్ 24 (అంకుశం పత్రిక):** మంగళవారం అమ్మవారిశాల లోపలికి వెళ్లి గడియ బిగించుకొని ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్న ఆర్యవైశ్య సోదరుడు గొర్లమంద సత్యనారాయణ ఎట్టకేలకు అదే రోజు సాయంత్రం దీక్ష విరమించాడు. దేవాలయం లోపల గడియ బిగించుకొని కూర్చోవడం వల్ల గుడికి వచ్చే భక్తులకు ఇబ్బందులు అని ప్రజలు, పోలీసులు నచ్చచెప్పడంతో పాటు త్వరలో జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేయించి న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇచ్చి సత్యనారాయను బయటకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బాధితుడు గొర్లమంద సత్యనారాయణ విలేకరులతో మాట్లాడుతూ... వెంటనే జనరల్ బాడీ సమావేశం ఏర్పాటుకు తేదీ నిర్ణయించమని ఎస్ఐ హనుమంతు ఆలయ కమిటీ అధ్యక్షుడు విశ్వనాధుల సత్యనారాయణకు చెప్పడం జరిగింది అని తెలిపారు. ఇరు వైపుల నుంచి వైశ్య కమ్యూనిటీకే చెందిన చెరి ఇద్దరు



స్థానికేతర( బయటి వ్యక్తులు) పెద్ద మనుషులను సమావేశానికి తెచ్చుకోవాలని ఆరోజు అన్ని కోణాల్లో పరిశీలించి ఈ సమస్యకు పులిస్టాప్ పెడతామని ఎస్ఐ హామీ ఇచ్చారన్నారు. పూజారి కౌసిక్ శర్మపై నేను దాడి చేసినట్లు ప్రచారం చేస్తున్నారని, అలా అని పోలీసులకు పిర్యాదు కూడా చేశారని... ఇదంతా అపద్దమని అన్నారు. గుడిలోకి వెళ్ళబోతుంటే పూజారి అడ్డుకునే ప్రయత్నం చేశాడని, లోపలికి పోయే ప్రయత్నంలో నెట్టడం జరిగిందే తప్ప నేను పూజారిపై ఎటువంటి దాడి ప్రయత్నం చేయలేదని, పూజారే నా పట్ల దురుసుగా ప్రవర్తించాడని, అక్కడున్న సీసీ టీవీ పుటేజ్ పరిశీలించాలని సత్యనారాయణ అన్నారు. నాకు జనబలం లేదని, వీళ్లంతా నాపై దాడి చేసే అవకాశం కూడా ఉందని, రక్షణ కల్పించాలని పోలీసులను కోరినట్లు సత్య నారాయణ చెప్పడం జరిగింది. రక్షణ కోరుతూ త్వరలో మైదుకూరు డిఎస్పీకి వినతి పత్రం ఇస్తానన్నారు.

## కుల్లాయి స్వామి, ఆంజనేయస్వామీ ఆలయాలపై వ్యాపార ప్రచార స్క్రోలింగ్...... ఇదెక్కడి కొత్త సాంప్రదాయం అంటున్న భక్తులు.... తొలగింప చేస్తాం.. ఆలయ ఈవో శోభ

**నార్పల అంకుశం న్యూస్ 24 :** మండల పరిధిలోని గుగుడు కుల్లాయి స్వామి బ్రహ్మోత్సవాల్లో కుల్లాయి స్వామి, ఆంజనేయస్వామి ఆలయాలపై లైటింగ్ విద్యుత్ అలంకరణ చేశారు ఆ లైటింగ్ లో లైటింగ్ ఏర్పాటు చేసిన వారి వివరాలతో వ్యాపార ప్రకటన స్క్రోలింగ్ ఏర్పాటు చేయడం పట్ల పలువురు భక్తులు ఎప్పుడూ లేని విధంగా ఇదెక్కడి వింత పోకడ ఈ విషయాన్ని గ్రామస్తులు, అధికారులు గుర్తించలేదా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .కుల్లాయి స్వామి బ్రహ్మోత్సవాల్లో గత కొన్ని సంవత్సరాల నుంచి స్థానిక జిల్లా వాసులే బ్రహ్మోత్సవాల్లో లైటింగ్, సప్లయర్స్, బారికేట్ల ఏర్పాట్ల పనులు చేసేవారు గత ఏడాది నుంచి టెండర్ ప్రక్రియ ఏర్పాటు చేశారు. అని ఆలయ విద్యుత్ అలంకరణ లైటింగ్ పనులు, బారికెట్ల ఏర్పాటు సప్లయర్స్ తదితర వాటిని కడప జిల్లా పొద్దుటూరు వారు దక్కించుకున్నారు అని లైటింగ్ టెండర్ దక్కించున్నవారు గూగుడు కుల్లాయి స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలపై రాత్రి సమయంలో వారి వ్యాపార సముదాయాల ప్రచారం చేస్తూ వారి పేర్లు వచ్చే విధంగా టెండర్ ప్రక్రియలో ఒప్పందంలో భాగమా లేక వారి లైటింగ్ ప్రచారం కోసం బ్రహ్మోత్సవాల్లో కుల్లాయి స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలకు ఉచితంగా లైటింగ్ చేశారా అంటూ భక్తులు అడుగుతున్నారు.... దీనిపై ఆలయ కార్య నిర్వహణ అధికారి సాకేతపురం శోభాను వివరణ కోరగా టెండర్ ప్రక్రియలో అటువంటి ఒప్పందం ఏది జరగలేదని ఆలయ లైటింగ్ నిర్వాహకులతో మాట్లాడి భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా అటువంటి వ్యాపార ప్రకటన స్క్రోలింగ్ ను వెంటనే తీసివేస్తాం అని తెలిపారు.



# ఈనెల 26న తాడిపత్రిలో గాంధీ విగ్రహం వద్ద సామూహిక దీక్ష

-- వైసీపీ నేత గంగులకుంట కేశవరెడ్డిపై దాడి ఘటన దుర్మార్గం
- వైఎస్ఆర్సీపీ నాయకుల స్పష్టీకరణ..
- గంగులకుంట కేశవరెడ్డికి పరామర్శ




**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 24 :**అనంతపురం జిల్లా తాడిపత్రి లో ఈనెల 26 వ తేదీన గాంధీ విగ్రహం వద్ద వైఎస్సార్సీపీ పార్టీ ఆధ్వర్యంలో సామూహిక దీక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్క వైఎస్సార్సీపీ కార్యకర్త పాల్గొని తాడిపత్రిలో దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడుతామని వైఎస్ఆర్సిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. అనంతపురంలోని వైఎస్ఆర్సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, తాడిపత్రి సమన్వయకర్త కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఉరవకొండ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య ప్రెస్‌మీట్ తాడిపత్రిలో వైఎస్ఆర్సీపీ నేత గుంగులకుంట కేశవరెడ్డిపై టీడీపీ శ్రేణుల దాడిని తీవ్రంగా పరిగణించిన నేతలు తాడిపత్రిలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం ఉద్యమానికి శ్రీకారం.. ఈనెల 26వ తేదీన తాడిపత్రిలోని గాంధీ విగ్రహం వద సామూహిక దీక్ష చేయాలని నిర్ణయం ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ..తాడిపత్రిలో శాంతి భద్రతలు క్షీణించాయి. టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి చెప్పుచేతల్లో పోలీసులు పనిచేయడం దుర్మార్గం. అని అనంత వెంకట్రాంరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ నేత గంగులకుంట కేశవరెడ్డి పై హత్యాయత్నం దారుణం. ఈ ఘటన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రి పై దాడి చేయడం దుర్మార్గం. జేసీ ప్రభాకర్ రెడ్డి దౌర్జన్యాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడం లేదు

-- తాడిపత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డి డైరక్షన్ లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయివిచ్చలవిడిగా గంజాయి, చైన్ స్నాచింగ్స్ జరుగుతున్నా పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. అని వెంకట్రాంరెడ్డి అన్నారు. జేసీ ప్రభాకర్ రెడ్డి ఇచ్చే లంచాలకు పోలీసు అధికారులు అలవాటు పడ్డారు. అందుకే తాడిపత్రి లో శాంతి భద్రతలను పోలీసులు గాలికొదిలేశారు అని అనంత వెంకట్రామిరెడ్డి ధ్వజమెత్తారు. జీతాల కన్నా... లంచాల రూపంలో పది రెట్లు డబ్బు వస్తున్నందునే పోలీసు అధికారులు జేసీ ప్రభాకర్ రెడ్డి ఆగడాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారుపోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేయాలంటే జేసీ ప్రభాకర్ రెడ్డి అనుమతి కావాలా? అని వైసిపి నేతలు నిరదీశారు నేరాలకు పాల్పడటం... కౌంటర్ కేసులు పెట్టడం... జేసీ ప్రభాకర్ రెడ్డికి అలవాటుగా మారింది తాడిపత్రి పోలీసు అధికారులు ఖాకీ చొక్కా తీసేసి.. టీడీపీ కండువాలు వేసుకుంటే మంచిది జేసీ దౌర్జన్యాలను చట్టబద్ధంగా ఎదుర్కొంటాం

అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న గంగులకుంట కేశవరెడ్డిని పరామర్శించిన నాయకులిలి

# ప్రభుత్వం కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలి..

– జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్




**అంకుశం న్యూస్అనంతపురం, జూన్ 24:** ఎస్సీ ,ఎస్టీ ,బీసీ, మైనారిటీ సంక్షేమశాఖ అధికారులు తమ పనితీరును మెరుగు పరచు కోవాలనిఅలాగేఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సంక్షేమ శాఖలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు విద్యను అభ్యసించేలా వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలలో పరిశు భ్రతకు అత్యంత ప్రాధాన్యతఇవ్వాలని రెసిడెన్షి యల్ పాఠశాలలుకళాశాలల్లో గురుకులనిర్వహణలోఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా విద్యార్థులకు అన్ని సదుపాయాలు అందుబా టులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలుచేపట్టాలని సూచించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించా.. లన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించడం తోపాటునిరంతరం పర్యవేక్షిం చాలన్నారు. అకాడమిక్ ఏడాదిలో హాస్టల్ వార్డెన్ లతో సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని తెలిపారు. దివ్యాంగులకు పెండింగ్ లేకుండా వందశాతం యు డి ఐ డి కార్డులను అందించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యార్థుల వసతి గృహాలు,పాఠశాలలగదులను పరిశీలించి అవసరమైన మేరకుశిథిలావస్థకుచేరుకున్న భవనాలను గుర్తించి నూతన భవన నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆయా శాఖల పరిధిలో ఐవిఆర్ఎస్ కాల్స్ విషయం లో మరింత పురోగతి తీసుకురావాలని హాస్టల్లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలవుతుందా హెచ్ పి టి ఎస్ యాప్ ను ఆయా శాఖల అధికారులు రోజు మానిటర్ చేయాలని యాప్లోఫోటోలను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలంటారు. పెండింగ్ లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని అలాగే ఆయాపాఠశాల లోమరుగుదొడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గిరిజన తండా లలో అక్షరాస్యత కార్యక్రమాన్ని విస్తృతపర చాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారికి సూచించారు. అలాగే పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం వివరాలతో పాటు విద్యార్థుల ప్రవేశాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని హాస్టల్లోపనిచేస్తున్నఉద్యోగుల హాజరుకు సంబంధించి ఎఫ్ ఆర్ ఎస్ యాప్ లో నమోదు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పదవ తరగతి ఫలితాలపై అనాలసిస్ ఫలితాలు ఎందుకు తక్కువ వచ్చాయి కారణాలు తెలుసుకో వాలన్నారు. విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పకుండా జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఆయా హాస్టల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయాలని ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో వసతి గృహాల్లోనే విద్యార్థులు ప్రవేశం పొందే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ డిడి మరియు డి టి డబ్ల్యూ శ్రీనివాసరావు, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, బీఎండబ్ల్యూ రామ సుబ్బారెడ్డి, డ్వామా పిడి సలీం భాష,డి ఆర్ డి ఏ పి డి మరియు సమగ్ర శిక్ష ఏపీసి శైలజ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముదా, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి అర్చన మైనర్ ఇరిగేషన్ ఎస్ ఈ విశ్వనాథ్ రెడ్డి బీసీ కార్పొరేషన్ఈడీసుబ్రహ్మణ్యం ఇన్చార్జి డి ఈ వో శ్రీనివాసరావు ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరంలో ఘనంగా శ్రీ లక్ష్మి చెన్న కేశవ స్వామి వారి మహాశాంతి ప్రతిష్ఠ -- కుంభాభిషేక మహోత్సవాలు




– ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్ యాదవ్

**అంకుశం న్యూస్ ధర్మవరం, జూన్ 24:** ధర్మవరం పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో 12 సంవత్సరాలకు ఒకసారి అత్యంత వైభవంగా నిర్వహించే మహాశాంతి ప్రతిష్ఠ మరియు కుంభాభిషేక మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ దివ్య కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. మహోత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ స్వాతి పుణ్యాహ వచనం నిర్వహించి యాగశాల, ఆలయ పరిసరాలను పవిత్రం చేశారు. తరువాత ఆగమ శాస్త్రోక్తంగా నిత్య మాతృక హోమాలు, పంచసూత హోమాలు నిర్వహించారు. ఈ హోమాల ద్వారా దైవ శక్తులను ఆవాహన చేసి మహోత్సవానికి మరింత ఆధ్యాత్మిక వైభవం చేకూర్చారు. హోమ కార్యక్రమాల అనంతరం అత్యంత పవిత్ర ఘట్టమైన మహా పూర్ణాహుతి నిర్వహించబడింది. అగ్నిదేవునికి సమస్త సమర్పణలను అర్పిస్తూ లోకక్షేమం, ప్రజల శ్రేయస్సు, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆలయానికి చేరుకుని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి ప్రముఖ వైష్ణవ పీఠాధిపతి త్రిడండి అష్టాక్షరి సంపత్ కుమార్ రామానుజ జీయర్ స్వామిని కలిసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జీయర్ స్వామి వారు మంత్రి గారిని ఆశీర్వదిస్తూ ప్రజాసేవలో మరింత విజయాలు సాధించాలని, ధర్మవరం నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి చెందాలని ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మహాశాంతి ప్రతిష్ఠ, జీర్ణోద్ధరణ, మహా సంప్రోక్షణ మరియు కుంభాభిషేక మహోత్సవాలలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... ధర్మవరం ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని స్వామివారి వద్ద ప్రార్థించినట్లు తెలిపారు. నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, ఆరోగ్యం కలగాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముందుకు సాగాలని స్వామి వారి ఆశీస్సులు కోరినట్లు తెలిపారు. ఆధ్యాత్మిక శక్తి సమాజానికి సానుకూల దిశను చూపిస్తుందని, ఇటువంటి మహోత్సవాలు ప్రజల్లో భక్తి, ఐక్యత, సాంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని మంత్రి అన్నారు. శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం ధర్మవరం ప్రాంత ప్రజల ఆధ్యాత్మిక కేంద్రంగా ఎంతో విశిష్టత కలిగి ఉందని, ఇలాంటి దివ్య కార్యక్రమాలు ప్రాంతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో త్రిడండి అష్టాక్షరి సంపత్ కుమార్ రామానుజ జీయర్ స్వామి, ఎండోమెంట్ జిల్లా అధికారి నరసింహారాజు, ఈ.ఓ. బిఆర్. వెంకటేశులు, అడ్ హక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్వర ప్రసాద్, ఆలయ అర్చకులు, దేవస్థాన కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రాత్రికి కార్మికులతో కలిసి భోజనం చేస్తాం ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు గ్రామ పెద్దలు దేవాదాయ శాఖ అధికారులు



**నార్పల.. అంకుశం న్యూస్ జూన్ 24 :**గూగూడు కుల్లాయి స్వామి బ్రహ్మోత్సవాల్లో పారిశుద్ధ్య విధులు నిర్వహించడానికి గుగుడుకు వచ్చిన పారిశుద్ధ్య కార్మికులకు భోజనాల వద్ద అవమానం జరిగిందని కార్మికులు బాధపడ్డారని విషయం తెలుసుకొని ఆలయ కమిటీ చైర్మన్ నాగార్జున కమిటీ సభ్యులు ఆలయ కార్యనిర్వహణాధికారి సాకేతపురం శోభ గ్రామ పెద్దలు మాజీ జడ్పిటిసి జాఫర్ వలి, మాజీ ఎంపీటీసీ రాజన్న, అంకన్న తదితరులు కార్మికుల వద్దకు చేరుకొని జరిగిన పొరపాటుకు చింతిస్తూ కార్మికులకు బ్రహ్మోత్సవాలు అయిపోయే వరకు ఎటువంటి ఇబ్బంది ఉండదని ఈరోజు రాత్రికి పారిశుద్ధ్య కార్మికుల తోనే కలిసి అధికారులు కమిటీ సభ్యులు అందరూ భోజనం చేస్తామని హామీ ఇచ్చారు .తమ సమస్యలు తెలుసుకొని కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు అధికారులు తమ వద్దకి రావడం తో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు..

## పారిశుద్ధ్య కార్మికులకు భోజనాలు ఏర్పాటు చేస్తాం.... డిఎల్పిఓ విజయ్ కుమార్ ఎంపీడీవో మమతాదేవి...


**నార్పల అంకుశం న్యూస్.... 24:** గూగూడు బ్రహ్మోత్సవాల్లో విధులు నిర్వహించడానికి గూగూడుకు వచ్చిన పారిశుద్ధ్య కార్మికులకు తామే భోజనాలు ఏర్పాటు చేస్తామని డి ఎల్ పి ఓ విజయ్ కుమార్, ఎంపీడీవో మమత దేవి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులను పస్తు ఉంచి పనులు చేపించమని ఏడాది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక్కడికి రావడం జరిగింది అని వచ్చే ఏడాది నుంచి కార్మికుల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు కుల్లాయి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు విధుల్లో ఉన్న పదిమంది పంచాయతీ కార్మికులకు అదే విధంగా 21వ తేదీ నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పంచాయితీ కార్మికుల తో కలిపి మొత్తం 45 మంది కార్మికులకు 24వ తేదీ ఉదయం అల్పాహారం వరకు తామే ఏర్పాటు చేశామని బ్రహ్మోత్సవాల్లో 24వ తేదీ నుండి ప్రధాన ఘట్టాలు ప్రారంభమవుతాయని గుగూడులో విధులు నిర్వహించే కార్మికులు, అధికారులు అందరికీ దేవాదాయశాఖ వారే భోజనాలు ఏర్పాటు చేస్తారని అది ఆనవాయితీగా వస్తుందన్న ఉద్దేశంతో 24వ తేదీ మధ్యాహ్నం పారిశుద్ధ్య కార్మికులు అక్కడికి వెళ్లారని ఒక్కపూట భోజనానికి కార్మికులను అవమానకరంగా మాట్లాడటం బాధాకరమని కార్మికుల సమస్యలు తెలుసుకొని వెంటనే గూగుడు కు చేరుకున్న డి ఎల్ పి ఓ, ఎంపీడీవో పారిశుద్ధ కార్మికులతో మాట్లాడి భోజనానికి ఇకనుండి ఎటువంటి ఇబ్బంది ఉండదని ఉదయం, సాయంత్రం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం రాత్రి కూడా కార్మికులకు భోజనం గ్రామ పంచాయతీ ద్వారా ఏర్పాటు చేస్తామని తెలిపారు.ఈ సంవత్సరము భక్తులకు ఇబ్బందులు పడకుండా పారిశుద్ధ్య చేయాలి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్యామల, సుజాత కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటరమణ, కుల్లాయి స్వామి,రాజేశ్వరి, కుల్లాయప్ప పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు..

## పారిశుద్ధ్య కార్మికులకు భోజనాలు ఏర్పాటు చేస్తాం.... డిఎల్పిఓ విజయ్ కుమార్ ఎంపీడీవో మమతాదేవి...



**నార్పల అంకుశం న్యూస్.... 24:** గూగూడు బ్రహ్మోత్సవాల్లో విధులు నిర్వహించడానికి గూగూడుకు వచ్చిన పారిశుద్ధ్య కార్మికులకు తామే భోజనాలు ఏర్పాటు చేస్తామని డి ఎల్ పి ఓ విజయ్ కుమార్, ఎంపీడీవో మమత దేవి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులను పస్తు ఉంచి పనులు చేపించమని ఏడాది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక్కడికి రావడం జరిగింది అని వచ్చే ఏడాది నుంచి కార్మికుల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు కుల్లాయి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు విధుల్లో ఉన్న పదిమంది పంచాయతీ కార్మికులకు అదే విధంగా 21వ తేదీ నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పంచాయితీ కార్మికుల తో కలిపి మొత్తం 45 మంది కార్మికులకు 24వ తేదీ ఉదయం అల్పాహారం వరకు తామే ఏర్పాటు చేశామని బ్రహ్మోత్సవాల్లో 24వ తేదీ నుండి ప్రధాన ఘట్టాలు ప్రారంభమవుతాయని గుగూడులో విధులు నిర్వహించే కార్మికులు, అధికారులు అందరికీ దేవాదాయశాఖ వారే భోజనాలు ఏర్పాటు చేస్తారని అది ఆనవాయితీగా వస్తుందన్న ఉద్దేశంతో 24వ తేదీ మధ్యాహ్నం పారిశుద్ధ్య కార్మికులు అక్కడికి వెళ్లారని ఒక్కపూట భోజనానికి కార్మికులను అవమానకరంగా మాట్లాడటం బాధాకరమని కార్మికుల సమస్యలు తెలుసుకొని వెంటనే గూగుడు కు చేరుకున్న డి ఎల్ పి ఓ, ఎంపీడీవో పారిశుద్ధ కార్మికులతో మాట్లాడి భోజనానికి ఇకనుండి ఎటువంటి ఇబ్బంది ఉండదని ఉదయం, సాయంత్రం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం రాత్రి కూడా కార్మికులకు భోజనం గ్రామ పంచాయతీ ద్వారా ఏర్పాటు చేస్తామని తెలిపారు.ఈ సంవత్సరము భక్తులకు ఇబ్బందులు పడకుండా పారిశుద్ధ్య చేయాలి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్యామల, సుజాత కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటరమణ, కుల్లాయి స్వామి,రాజేశ్వరి, కుల్లాయప్ప పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు..

## విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ



**.పోరుమామిళ్ల /కాశినాయన, జూన్ 24 (అంకుశం పత్రిక):** కాశినాయన మండలంలోని బాలాయపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 10 వేల రూపాయలు విలువ చేసే విద్యా సామాగ్రిని బుధవారం మండల విద్యా శాఖ అధికారుల చేతులమీదుగా ఉచితంగా అందించారు. దుబాయ్ లో క్రీడా ఫోటో గ్రాఫర్ గా విధులు నిర్వహిస్తున్న పోరుమామిళ్ల, మహబూబ్ నగర్ వీధికి చెందిన జిలాని ఈ విద్యా సామాగ్రిని స్పాన్సర్ చేశారు. నావంతు సాయంగా పేద విద్యార్థులకు విద్యా సామాగ్రి అందించడం సంతోషంగా ఉందని ఫోన్ ద్వారా మాట్లాడారు. ఉపాధ్యాయుడు ఖాశింవల్లి వల్లనే ఇదంతా సాధ్యమైంది అన్నారు. సమాజ మార్పు ఉపాధ్యాయుల కృషితోనే సాధ్యం అన్నారు. దాత జిలానీ, ఉపాధ్యాయుడు ఖాసీం వల్లీలను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పల్లా దస్తగిరి బాబు, ఉపాధ్యాయులు కాసిం వలీ, మండల విద్యాశాఖ అధికారులు మొహమ్మద్ షఫీ, నిర్మల, సి ఆర్ పి ఖాజా మొహిద్దిన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.